# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ మార్చి 05 బుధవారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 225

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

**పులిపిల్లలతో సరదాగా గడిపిన ప్రధాని**



భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు 2014-15 ఖరీఫ్ కాలంలో తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి చెల్లించాల్సిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు.

# రూ.1,891 కోట్ల బకాయిలు చెల్లించండి



నిన్న సీఆర్ పాటిల్‌తో భేటీ.. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న(సోమవారం) భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రితో సీఎం రేవంత్ చర్చించారు. సీఎం వెంట తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం, భీమా ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ స్టేజి -2కు సంబంధించి భూసేకరణ, వివాదాలు 18,189 కోట్ల రూపాయల పెండింగ్ పనులు గురించి రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

దిల్లీ: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)కు 2014-15 ఖరీఫ్ కాలంలో తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి చెల్లించాల్సిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం ఇక్కడ కేంద్రమంత్రితో భేటీ అయి ఈ అంశంపై చర్చించారు. 2014-15లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం బకాయిపడి పదేళ్లయినందున వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యంతోపాటు 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యం బకాయిలు రూ.343.27 కోట్లనూ విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆహారభద్రత చట్టం పరిధిలోకి రాని వారికి 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలనీ కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును ప్రతిసారీ నెల రోజులు కాకుండా.. ఒకేసారి నాలుగు నెలలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని కేంద్ర మంత్రి జోషికి ముఖ్యమంత్రి వివరించారు.

4 వేల మెగావాట్ల మంజూరును పునరుద్ధరించండి..

రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి 'పీఎం కుసుమ్' కింద గతంలో ఇచ్చిన అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రిత్వశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దాన్ని వెయ్యి మెగావాట్లకు కుదించిందని సీఎం ఆయనకు తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని, అందువల్ల

ఈ 4 వేల మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని

కోరారు. ముఖ్యమంత్రి వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశానంతరం విలేకరులకు తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.



2లో

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన బోర్డు

మొత్తం 1,532 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

సిసి కెమరాలతో కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ

నిముషం నిబంధన ఎత్తివేత..5 నిముషాల వరకు అనుమతి



2లో

# కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు

## హైకోర్టులో పిటిషన్ దాఖలు



తెలంగాణలో ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు..

# ఆధిక్యంలో భాజపా అభ్యర్థి

**కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా కొనసాగుతోంది.**

కరీంనగర్-నిజామాబాద్-మెదక్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉత్కంఠగా కొనసాగుతోంది. ఇప్పటి వరకు 9 రౌండ్ల ఫలితాలు వెలువడ్డాయి. తొమ్మిదో రౌండ్‌లో భాజపా అభ్యర్థి అంజిరెడ్డికి 6,245 ఓట్లు వచ్చాయి. దీంతో 9 రౌండ్లు పూర్తయ్యే సరికి ఆయనకు మొత్తంగా 63,871 ఓట్లు పోలయ్యాయి. కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి 9వ రౌండ్‌లో 6,921 ఓట్లు సాధించారు.

9 రౌండ్లు పూర్తయ్యే సరికి ఆయనకు మొత్తంగా 59,831 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం భాజపా అభ్యర్థి అంజిరెడ్డి 4,040 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మొత్తం లెక్కించాల్సిన ఓట్లు 2,24,000కాగా.. ఇప్పటివరకు 1,89,000 ఓట్ల లెక్కింపు పూర్తయింది.

ఈ దఫా ఎన్నికల్లో భారీగా చెల్లకుండా పోయిన ఎమ్మెల్సీ ఓట్లు గ్రాడ్యుయేట్ పరిధిలో 28 వేలు, టీచర్లవి 1,396 ఓట్లు ఇన్‌వ్యాలిడ్ చెల్లని ఓట్లు ఎవరి కొంపముంచుతాయో నని గ్రాడ్యుయేట్ అభ్యర్థుల ఆందోళన



2లో

# డీ లిమిటేషన్‌తో ఎంపి సీట్లు తగ్గవు

త్వరలో రాష్టాలకు కొత్త అధ్యక్షులు

మీడియాతో బిజెపి ఎంపి లక్ష్మణ్



2లో

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

నోటీసులు జారీ చేసిన సుప్రీం ధర్మాసనం

విచారణ 25కు వాయిదా

# రూ.30 వేల కోట్ల విలువైన భూముల అమ్మకంపై దృష్టి!

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. అంగుళం ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను వేలం వేయడానికి తెరలేపారని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. అంగుళం ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోమంటూ ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేసిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను వేలం వేయడానికి తెరలేపారని మాజీ మంత్రి హరీశ్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. "కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నంబరు 25 పరిధిలోని 400 ఎకరాలను బ్యాంకర్లకు తనఖా పెట్టిన సమయంలో ప్రభుత్వం రూ.25 కోట్లకు ఎకరం చొప్పున రూ.10 వేల కోట్లు ఇప్పటికే సమీకరించింది. ఇప్పుడు అదే భూమిని వేలం వేసి రూ.30 వేల కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది జూన్ 26న విడుదల చేసిన జీవో ఎంఎస్ 54పై నేను డిసెంబరులో అసెంబ్లీలో నిలదీస్తే.. అలాంటిదేమి లేదని, టీజీఐఐసీకి చేస్తున్నది భూబదలాయింపు మాత్రమేనని



బుకాయించారు. నిండు సభలో సీఎం సహా మంత్రులు తప్పుడు సమాధానం చెప్పి, సభ్యులను తప్పుదోవ పట్టించారు. దీనిపై యావత్ తెలంగాణకు వారు క్షమాపణలు చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.నక్షత్రం గుర్తులేని ప్రశ్నలకు సమాధానాలివ్వండి నక్షత్రం గుర్తు లేని ప్రశ్నలకు సమాధానాలు



# ప్రక్షాళన మొదలు.. ఆ నేతలకు మీనాక్షి నటరాజన్ వార్నింగ్

హైదరాబాద్: సోషల్ మీడియా వేదికగా సొంత పార్టీ నేతలు విమర్శించుకోవద్దని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సూచించారు. ఆమె నేటి నుంచి రాష్ట్రంలో పార్టీ పనితీరుపై పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా చేపట్టారు. గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన మెదక్ లోక్‌సభ నియోజకవర్గ సమీక్ష నిర్వహించారు. పార్టీ అంతర్గత విషయాలు బయటకు మాట్లాడితే వేటు తప్పదంటూ మీనాక్షి నటరాజన్ హెచ్చరించారు.పార్టీ కోసం పనిచేసిన వారి వివరాలు తానే స్వయంగా తెప్పించుకుంటున్నానని చెప్పిన మీనాక్షి.. నియోజకవర్గ ఇంఛార్జ్‌లు బాధ్యతతో పనిచేయాలన్నారు. ఇంఛార్జ్ వల్లే సమస్యలు వస్తే.. పదవి నుంచి తొలగిస్తామంటూ ఆమె ఖరాఖండిగా చెప్పేశారు. పటాన్ చెరువులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారన్న కాట శ్రీనివాస్ గౌడ్.. సమస్య పరిష్కారం కోసం కమిటీ వేసినా.. ఇప్పటి వరకు రిపోర్ట్ ఇవ్వలేదంటూ ఫిర్యాదు చేశారు. వీలైనంత త్వరగా

సమస్య పరిష్కరించాలంటూ ఇంఛార్జ్‌ని కాట కోరారు.అధికారులు తమ మాట వినడం లేదన్న మరి కొందరు నేతలు.. ఇంకా బీఆర్ఎస్ నేతలే అధికారం చెలాయిస్తున్నారంటూ మరికొంతమంది ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఇందిరమ్మ ఇల్లు అయినా తాము చెప్పిన వారికి ఇస్తే గౌరవం ఉంటుందంటూ మీనాక్షి నటరాజన్‌కు పలువురు నేతలు చెప్పారు.

# డీ లిమిటేషన్‌తో ఎంపి సీట్లు తగ్గవు

**హైదరాబాద్:** డీలిమిటేషన్ ద్వారా దక్షిణాదిలో ఒక్క పార్లమెంట్ సీటు కూడా తగ్గదని ప్రధాని మోదీ చెప్పారని భాజపా రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. జనగణన చేసిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ లక్ష్మణ్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. 2011తో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో జనాభా తగ్గింది. జనాభా తగ్గినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గవు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో 153 సీట్లు తెలంగాణలో పెంచాలని పెట్టారు. దక్షిణాది వ్యక్తికి జాతీయ అధ్యక్ష పదవి అని ఎక్కడా చర్చలేదు. 11 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాం.. త్వరలోనే అన్ని రాష్ట్రాలకు ప్రకటిస్తాం. డీపీఆర్ సర్వే సక్రమంగా చేయకపోతే ట్రిపుల్ ఆర్ వెనుకకు వెళ్తుంది. భారాస చేసిన తప్పునే కాంగ్రెస్ చేస్తే ఎట్లా? బీసీల్లో 10శాతం ముస్లింలను కలపకపోతే ఆమోదిస్తాం. కులగణన తప్పుల తడకగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు. భాజపా బలం పెరుగుతుందని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుంది. ఆయనే మిగతా నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాం. సీఎం మార్పు అనేది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం.

జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతోంది.. ఇప్పటికే రెండు మూడు సమావేశాలు జరిగాయి. కుల గణన చేపట్టి రేవంత్ రెడ్డి ఏ ఒక్కరిని సంతృప్తి పరచలేదని లక్ష్మణ్ అన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్యేలపై విచారణ

**న్యూఢిల్లీ:** బిఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. గత విచారణ సందర్భంగా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోడానికి ఎంత సమయం తీసుకుంటారో స్పీకర్‌తో సంప్రదించి వివరాలు అందించాలని ధర్మాసనం ఆదేశించింది. కౌంటర్లు దాఖలు చేయడానికి ఇప్పటి వరకు తమకు ఎలాంటి నోటీసులు రాలేదని, సాంకేతికంగా ఇది గమనించాల్సిన విషయమని రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ కార్యదర్శి తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రాష్ట్ర ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్, కార్యదర్శి, 10 మంది ఎమ్మెల్యేలు, కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22లోపు నోటీసులకు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ మాహిస్ జార్జ్‌ల ధర్మాసనం మార్చి 25కి వాయిదా వేసింది.

# కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదు

**హైదరాబాద్:** భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే

చట్టప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా.. ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కోర్టులు జోక్యం చేసుకోవచ్చని.. ఈ మేరకు వాదనలు వినిపించడానికి గడువు కావాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరడంతో.. విచారణను కోర్టు 2 వారాలకు వాయిదా వేసింది.

# వ్యవసాయంపై అవగాహనలేని సీఎం

**హైదరాబాద్:** వ్యవసాయంపై అసలు సీఎం రేవంత్‌రెడ్డికి కొంచెం కూడా అవగాహన లేదని, అందుకే పంటలు ఎండుతున్నా.. చీమకుట్టినట్టుగా లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతు ఏ కారణం చేత మరణించినా రూ.5 లక్షల పరిహారం అందించే పథకం రైతు బీమా.. రైతు చనిపోయిన ఏడు పని దినాలలో రైతు కుటుంబానికి పరిహారం అందేదన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పథకాలలో ఒకటి రైతు బీమా, రైతుబంధు అని యూఎన్ఓకు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ సంస్థ ప్రకటించిందని గుర్తుచేవారు. రైతు బీమా పథకం ప్రవేశపెట్టిన తరువాత డిసెంబర్ 4, 2023 బీఆర్ఎస్ ప్రభుత్వం దిగిపోయే వరకు రాష్ట్రంలో 1,18,197 మంది రైతులు మరణించగా రూ.5,909.85 కోట్లు ఆ రైతు కుటుంబాలకు పరిహారంగా అందించడం జరిగిందని పేర్కొన్నారు. రైతు బీమా పథకం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6122.65 కోట్లు ఎల్ఐసీకి ప్రీమియంగా చెల్లించిందని తెలిపారు. ఏడాదికి రూ.1500 కోట్లకు గాను రెండో విడత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.750 కోట్ల ప్రీమియం చెల్లించని కారణంగా ఏడు వేల పైచిలుకు కుటుంబాల పరిహారం పెండింగ్‌లో ఉన్నాయని నిరంజన్ రెడ్డి తెలిపారు. 15 నెలలలో 440కి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు రాదు, నీళ్లు రావు, రైతుబంధు రాదు, రైతు బీమా ప్రీమియం చెల్లించరు.. మరి కాంగ్రెస్ ప్రభుత్వం ఏమిస్తున్నది? కాంగ్రెస్ అభయహస్తంలో వ్యవసాయానికి రూ.3 లక్షల వడ్డీ లేని రుణం అన్నారు. 24 గంటల కరెంటు అన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ మొదలే పెట్టలేదు. వ్యవసాయ అనుబంధ రంగాలలో ఖాళీలను భర్తీ చేయలేదని విమర్శించారు. అసైన్డ్ పోడు భూములకు పట్టా భూములతో సమానంగా పరిహారం అని దాని ఊసెత్తడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ భూములను కుదువపెట్టి రైతు భరోసా కోసం అని రూ.10 వేల కోట్లు తెచ్చి రెండు నెలలు అవుతుంది.. మూడెకరాల వరకు రైతులకు కూడా రైతు భరోసా నిధులు పడలేదు. మూడెకరాల వరకు రైతు భరోసా ఇచ్చామని వ్యవసాయ మంత్రి చెబుతుంటే.. మూడెకరాల వరకు రైతులకు డబ్బులు వేయాలని ఉప ముఖ్యమంత్రి చెబుతున్నారు. పది వేల కోట్లు తెచ్చిన ప్రభుత్వానికి రూ.750 కోట్లు రైతు బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వానికి ఎందుకు మనసు రావడంలేదు? ఇది రైతు అనుకూల ప్రభుత్వమా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. రైతు బీమాను ప్రభుత్వం నీరు గార్చే ప్రయత్నం చేస్తుంది. రైతులు కష్టపడి పంటలు పండిస్తుంటే సాగునీళ్లు లేక, కరెంటు లేక రైతుల పొలాలు ఎండుతున్నాయి, పశువులకు మేతగా మారుతున్నాయి, రాష్ట్రంలో అనేక సమస్యలతో రైతులు సతమతం అవుతున్నారు. యాసంగి సీజన్ మొదలయ్యే సమయానికి సమీక్ష చేయడంలో ప్రభుత్వం విఫలమయింది. రాష్ట్ర ప్రభుత్వ అన్ని వైఫల్యాలకు కారణం కేసీఆర్ అని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకుంటుంది. రైతులు పంటలు వేసుకున్న తర్వాత రైతు కమీషన్ చైర్మన్ కోదండరెడ్డితో రైతులు పంటలు వేసుకోవద్దు అని చెప్పించారు. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖా మంత్రి చెప్పకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి గారితో సాగునీళ్లకు కొరత లేదని చెప్పించారు. మరి నీటికి, కరెంటుకు సమస్య లేకుంటే రైతులు దేనికి ఆందోళన చెందుతున్నట్లు ప్రభుత్వం సాగునీటి మీద సమీక్ష ఎందుకు చేయలేదు? అని నిరంజన్ రెడ్డి నిలదీశారు.

# కాంగ్రెస్‌లో కీచురాళ్ల రొద

**పదవుల కోసం పార్టీనే భ్రష్టు పట్టించే నేతలు**

**గట్టిగానే వార్నింగ్ ఇచ్చేలా మీనాక్షి నటరాజన్ చర్యలు**

హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్‌లో సన్వయం లోపించిందా ..అంటే ఔననే సమాధానం వస్తోంది. విమర్శలను గట్టిగా తిప్పికొడ్డంలో విఫలం అవుతున్నారు. అలాగే మీనాక్షి నటరాజన్ వచ్చాక వేగంగా పరిణామాలు మారు తున్నాయి. వీటిని ఆధారం చేసుకుని సిఎం రేవంత్ రెడ్డిని మార్చడం ఖాయమని బిజెపినేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఇవన్నీ ఎలా ఉన్నా కాంగ్రెస్‌లో మాత్రం ఎవరికి వారే యమునా తీరే అన్నచందంగా ఉన్నారు. అయితే మీనాక్ష నటరాజన్ కొంత కటువుగానే ఉంటానని సంకేతాలు ఇచ్చారు. తీన్మార్ మల్లన్న పార్టీ నుంచి సస్పెండ్ చేయడం,కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ నివాసంలో మున్నూరు కాపు నేతల సమావేశంపైనా ఆమె గట్టిగానే మందలించారు. ఈ క్రమంలో ఆమె కటువువగా ఉంటే కనీసం పార్టీలో కట్టుబాట్లు అయినా కఠినంగా

ఉంటాయని పలువురు భావిస్తున్నారు. నిజానికి కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ. ఎవరికి వారు తామే గొప్పఅనుకుంటారు. వాడి పీకుడెంత అన్న ధోరణిలో ఉంటారు. ఇలాంటి సందర్భంలో మీనాక్షి రావడంతో కొంత పార్టీలో ఆందోళన, అలజడి మొదలయ్యిందనే చెప్పాలి. గత కొంతకాలంగా అధికార కాంగ్రెస్ పార్టీ కట్టుబాట్లకు ఆ పార్టీ సీనియర్ నాయకులే తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నారు. అధికారం దక్కడంతో తమకు తిరుగు లేదని భావిస్తున్నారు. నిజానికి కెసిఆర్ కుటుంబ పాలన, అహంకారం, బిజెపి నుంచి బండి సంజయ్‌ను మార్చడం ఇత్యాదికారణాల వల్ల కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. అంతేకానీ కాంగ్రెస్‌పై ప్రేమతో ప్రజలు ఓట్లు వేయలేదు. దీనిని విస్మరించిన నేతలు ఇక తమకు తిరుగులేదన్నరీతిలో వ్యాఖ్యలుచేస్తున్నారు. గ్రామస్థాయి లో సమస్యలను విస్మరిస్తున్నారు. అందుకే ఇటీవల హద్దుమీరుతున్న ఈ నాయకుల తీరు పట్ల అధిష్ఠానాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. వీరి వైఖరి వల్ల కాంగ్రెస్ పార్టీ ఎ÷-పుడూ ఇంతేనని ప్రజల్లో బలంగా నాటుకున్న అభిప్రాయం మరింత బలపడింది. అందుకే పార్టీ గీత దాటుతున్న వారిని కట్టడి చేయడంలో భాగంగానే రాష్ట్ర పార్టీ ఇంచార్జీగా మీనాక్షి నటరాజన్‌ను నియమించినట్టు చెబుతున్నారు. తన తొలి సమావేశంలోనే పార్టీలో క్రమశిక్షణారాహిత్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని మీనాక్షి నటరాజన్ హెచ్చరించడం ఈ వాదనకు బలం చేకూర్చుతోంది. పార్టీ నేతలను కట్టడి చేయడంలో పూర్వ ఇంచార్జీ దీపాదాసు మున్షీ విఫలం అయిందని అధిష్ఠానం భావించడం వల్లనే కొత్త ఇంచార్జీని నియమించినట్టు పార్టీ వర్గాల సమాచారం. అలాగా మీనాక్షి కూడా కటౌట్లకు, పొగడ్తలకు, సన్మానాలకు దూరంగా ఉంటున్నారు. ఇకపోతే అధికారంలోకి రావడంతో కొందను పదవుల కోసం పట్టుబడుతున్నారు.మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు ఆశించే కొందరు సీనియర్లు పార్టీ పెద్దలను బ్లాక్‌మెయిల్ చేయడానికి వెనుకాడటం లేదన్న వాదనా ఉంది. వీటికి తోడుగా తాజాగా ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ పదవుల భర్తీ కూడా తోడైందని చెబుతున్నారు. పార్టీలో పదవులను పొందాలనుకునే నాయకులు నయానో భయానో పార్టీ పెద్దలను బెదిరించడానికి కుల రాజకీయాలకు తెర లేపారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మంత్రివర్గం లో ఎలాగైనా స్థానం సంపాదించే వ్యూహంతో మొదట పార్టీ వైఖరితో సంబంధం లేకుండా సీనియర్ నాయకుడు వివేక్ వెంకటస్వామి పెద్ద ఎత్తునా మాలల సభ నిర్వహించారు. నిజానికి ఆయనింటినుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఒక ఎంపి ఉన్నా..ఇంకా అసంతృప్తిని ప్రకటిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణపై పార్టీ వైఖరిని ప్రశ్నించే విధంగా వివేక్ వెంకటస్వామి తన సామాజిక వర్గాన్ని రెచ్చగొట్టేలా సభలుపెట్టి సవాల్ విసిరారు. మంత్రివర్గ విస్తరణలో స్థానం సంపాదించడానికే ఆయన కొంత బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్న ఫిర్యాదులు అధిష్ఠానానికి అందాయి. ఈ నేపథ్యంలో ఆయన ఢిల్లీకి వెళ్లి పార్టీ పెద్దలకు వివరణ ఇచ్చుకోక తప్పలేదని అంటున్నారు. అలాగే ఇటీవల మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ కూడా తన సామాజికవర్గం నేతలతో సమావేశం నిర్వహించి పార్టీ ముఖ్యులపై తీవ్ర ఆరోపణలు చేసారు. సికింద్రాబాద్ బరిలో దానం నాగేందర్‌కు కాకుండా తనకు టికెట్ ఇచ్చి ఉంటే గెలిచేవాడనని అంజన్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యనించారు. ఎంపి టికెట్ నిర్ణయం అనేది అధిష్ఠానం తీసుకున్న నిర్ణయమే తప్ప అది రాష్ట్ర నాయకుల నిర్ణయమన్న విషయం కాదన్నది అంజన్‌కుమార్ యాదవ్ వంటి సీనియర్ నాయకుడికి తెలియదనుకోవడానికి లేదు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీని దక్కించుకోవడానికే తన సామాజికవర్గం నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీ పెద్దలను పరోక్షంగా దారికి తెచ్చుకునే వ్యూహంతోనే అంజన్‌కుమార్ యాదవ్ ఈ సమావేశం ఏర్పాటు చేసి ఉంటారని రాజకీయ పరిశీలకులు కూడా అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటికే ఆయన తనయుడు రాజ్యసభ ఎంపిగా ఉన్నారు. అయినా తనకు కూడాపదవి కావాలన్నది ఆయన కోరిక.అంజన్‌కుమార్ యాదవ్ బాటలోనే మరో సీనియర్ నాయకుడు వి హనుమంతరావు తన సామాజిక వర్గం నేతలతో సమావేశం ఏర్పాటు చేసి పదవులలో తమ సామాజికవర్గం నేతలకు అన్యాయం జరిగిందనే వాదన గట్టిగా వినిపించారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ పదవి కోసమే విహెచ్ ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు అధిష్టానం పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది. సొంత పార్టీ నేతలతో కాకుండా ప్రతిపక్ష పార్టీలలో ఉన్న తమ సామాజిక వర్గం నేతలను కూడా ఈ సమావేశానికి విహెచ్ ఆహ్వానించడమే కాకుండా మున్నూరు కాపులకు కాంగ్రెస్ హయాంలో అన్యాయం జరుగుతుందనే విమర్శలు చేయించడాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం కోరేలా ఉంది.

# భక్తులకు అండగా పరమాత్ముడు!

**తిరుమల:** భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్త్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. భగవంతుడు అనేక విభూతులలో, అనేక కార్యాలు చేస్తూ, వేర్వేరు పేర్లతో, వేర్వేరు రూపాలతో, వేర్వేరు తత్త్వాలుగా కనిపిస్తాడు. మనం ఏ రూపంలో భక్తితో కొలిస్తే భగవంతుడు ఆ రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడు. మానవుడు తాను

కల్పించుకొనే మానవ సంబంధాలనే భగవంతునితో కల్పించు కొని... తద్వారా భగవంతునికి మరింత చేరువ కాగలడు.

# నేటినుంచి ఇంటర్ పరీక్షలు

హైదరాబాద్: తెలంగాణలో ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిపి దాదాపు పది లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో అబ్బాయిలు 4,97,528 మంది ఉండగా.. అమ్మాయిలు 4,99,443 మంది ఉన్నారు. మొత్తం 1,532 కేంద్రాల్లో జరగనున్న పరీక్షల కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు ఇంటర్ బోర్డ్ ప్రకటించింది. ఈసారి పరీక్షా కేంద్రాల గుర్తింపు కోసం హాల్ టిక్కెట్లపై క్యూర్ కోడ్‌లను సైతం ముద్రించటం విశేషం. ఇక పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ వంటి సమస్యలు తలెత్తకుండా సీసీ కెమెరా సర్వైలెన్స్, పెద్ద సంఖ్యలో స్క్వాడ్ లను సైతం ఏర్పాటు చేశామని ఇంటర్ బోర్డు సెక్రటరీ కృష్ణ ఆదిత్య వివరించారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు బోర్డ్ సర్వం సిద్ధం చేసిందని అన్నారు. మొదటి సంవత్సరం పరీక్షలు.. మార్చి 5వ తేదీ బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు ఇంటర్మీడియట్ పరీక్షలకు




ఈసారి కూడా ఒక్క నిమిషం ఆలస్యమనే నిబంధనను ఎత్తివేస్తున్నట్లు ఇంటర్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇంటర్మీడియట్ పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు అంటే.. ఉదయం 9.05 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని బోర్డు స్పష్టం చేసింది. పరీక్షా కేంద్రానికి కాస్త ముందుగా చేరుకుంటే ఒత్తిడి, ఆందోళనకు గురయ్యే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయని బోర్డు అధికారులు విద్యార్థులకు సూచించారు. ఇక నిబంధనల ప్రకారం ఉదయం 8.45 గంటల నుంచి 9 గంటల మధ్య.. విద్యార్థులకు ఓఎంఆర్ పత్రాన్ని అందజేస్తారు. వీటిని విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈసారి ఇంటర్ హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం లొకేషన్ సులువుగా తెలుసుకోవచ్చు.ప్రశ్నపత్రంపై సీరియల్ నెంబరు ముద్రిస్తున్నారు. దీంతో ఏ నెంబర్ ఉన్న పేపర్.. ఏ విద్యార్థికి వెళ్తుందో సులువుగా తెలుస్తుంది. ఒకవేళ అది బయటకు వచ్చినా వెంటనే ఏ పరీక్షా కేంద్రం, ఏ విద్యార్థిదనే విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. ఈ పరీక్షల వేళ.. స్మార్ట్ వాచ్‌లతోపాటు అనలాగ్ వాచ్‌లను సైతం నిషేధిస్తున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ సారి పరీక్షల వేళ.. చేతి గడియారాలనూ కూడా అనుమతించడం లేదు. ఇంటర్ బోర్డు కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)ని ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోని సీసీ కెమెరాలను ఈ కేంద్రంతో అనుసంధానించారు. మొత్తం 75 మంది సిబ్బంది.. ఈ పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఈ హెల్ప్‌లైన్ నెంబరు 92402 05555 ను సంప్రదించవచ్చునని బోర్డు కార్యాలయం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్‌మీడియట్ పరీక్షలు ప్రారంభమైనాయి. మార్చి 1వ తేదీ నుంచి మొదటి సంవత్సరం, మార్చి 3వ తేదీ నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైనాయి. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు.. హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకొనేందుకు వాట్సప్ నెంబర్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పాటు

చేసిన సంగతి తెలిసిందే.

# విస్తరణ దిశగా బిజెపి అడుగులు !

మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం తరవాత బిజెపి ఏ మాత్రం తగ్గడంలేదు. ఢిల్లీ గెలుపును ఆకాశమంత చేసి ప్రచారం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందే జరిగిన వరుస ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడంతో ఇక బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జరుగుతున్న వేళ బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. బీహార్‌లోనూ సొంతంగా పాగా వేసేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బెంగాల్లో మరోమారు తమవంతుగా ప్రయత్నాలు చేపట్టారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు బిజెపికి అత్యంత ముఖ్యం. ఓ రకంగా చెప్పాలంటే బిజెపి ఎత్తుల ముందు కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేక పోతోంది. అంబేద్కర్, రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ ఎంత రచ్చ చేసినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అలాగే బిజెపి ఎత్తులన్నీ కాంగ్రెస్‌ను పెద్ద దెబ్బకొట్టేలా ఉంటాయి. ఇవేవీ పెద్దగా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. బీజేపీ కూటమి వరుస విజయాలు బిజెపిని తిన్నగా కూర్చోనివ్వడం లేదు. అందుకే దక్షిణాదిలో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. తమిళనాడు, కేరళలో త్వరలో ఎన్నికలు రానున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే బీజేపీతో చేతులు కలిపేందుకు ఆయా రాష్ట్రాల్లో చిన్నాచితక పార్టీలు క్యూ కడుతున్నాయి.ఢిల్లీ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలకు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మున్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. అందుకే టిడిపితో కలిసి అధికారం పంచుకుంది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు దక్షిణాదిలో బిజెపికి తురుపు ముక్క కానున్నారు. ఆయన సనాతన ధర్మం పేరుతో చేస్తున్న యాత్రలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్రనాయకత్వాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు. ఇలా ప్రతి అంశంపై చర్చించిన బీజేపీ పెద్దలు మార్గనిర్దేశనం చేయబోతున్నట్లు సమాచారం. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేసుకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసి చూపింది. బిజెపి రాజకీయాల తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే

మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు. మోడీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది. ఇప్పుడు బిజెపి అధ్యక్షపదవికి ఎన్నిక జరగాల్సి ఉంది. బలమైన నేతకోసం గాలిస్తున్నారు. పార్టీని వ్యూహాత్మకంగా ముందుకు తీసుకుని వెళ్లగలిగే నేతకావాలి. దక్షిణాదికి చెందిన నేతల్లో ఒకరిని కూడా పరిశీంచే అవకాశం ఉంది. నిజానికి వెంకయ్యనాయుడు లాంటివారు పార్టీలో ఉండివుంటే అధ్యక్షపదవికి అవకాశం ఉండేది. దక్షిణాదిలో అలాంటి నేతలు లేరనే చెప్పాలి. తెలంగాణలో కూడా సమర్థుడైన, బలమైననేతను పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకోవాల్సి ఉంది. నిజానికి బిజెపి ఇప్పుడు మైనార్టీలో ఉంది. ముందుగా మెజార్టీ సాధించే ప్రయత్నాలు చేయడానికి మోడీద్వయం ఆలోచనచేస్తూ ఉంటుంది. ఎన్‌డిఎగా ఉన్నప్పటికీ సొంత బలం కోసమే బిజెపి ప్రయత్నాలు చేస్తుంది. అది కూడా ఈ యేడు మొదలు పెట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీని బలోపేతం చేయడం, అన్ని రాష్ట్రాల్లో అధికారం దక్కించు కోవడమే బిజెపి ముందున్న ప్రధాన లక్ష్యంగా చూడాలి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. ఇప్పటికే బిఆర్‌ఎస్, టీఎంసీ,డీఎంకే,ఎన్సీపీ, శివసేన ,ఎస్పీ, ఆర్జేడీ పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ప్రకటనలు చేస్తున్నాయి. హిందీ వ్యతిరేకతతో తమిళనాడు సిఎం స్టాలిన్ తన స్థానం పదిలం చేసుకునే పనిలో ఉన్నారు. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని చూస్తున్నా.. ఎవరికి కాలం కలసి రావడం లేదు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం కోసం చూస్తున్నాయి. అయతే అది సాధ్యం కాదని ఇప్పటికే తేలింది.

# పరిశోధనలతోనే “సమాజంలో మార్పు”






టియు వైస్ ఛాన్సర్ ఆచార్య టి. యాదగిరిరావు.

**వేగుచుక్క న్యూస్ , డిచ్ పల్లి , మార్చి 4:**

విశ్వవిద్యాలయాల్లో క్షేత్రస్థాయి పరిశోధనలే సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తాయని టియు వైస్ ఛాన్సర్ ఆచార్య టి. యాదగిరిరావు అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధన పత్రాల తయారీ అనే అంశంపై విభాగాధిపతి, కార్యాశాల కన్వీనర్ ఆచార్య సిహెచ్. ఆంజనేయులు అధ్యక్షతన ఒకరోజు కార్యశాలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఛాన్సర్ ఆచార్య టి యాదగిరిరావు మాట్లాడుతూ, యువత నూతన వినూతన మార్పుల కనుగుణంగా పరిశోధనలు చేయాలన్నారు. ఈక్రమంలో విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు కేంద్రంగా వర్ధిల్లుతాయన్నారు. ఆధునిక ప్రపంచంలో అద్భుతమైన మార్పులు విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనల వల్లనే సాధ్య మౌతాయన్నారు. అతిథిగా పాల్గొన్న రిజిస్ట్రార్ ఆచార్య ఎం యాదగిరి మాట్లాడుతూ, నూతన పరిశోధనలతో రోజురోజుకు పెరిగే సవాళ్లను అధిగమించాలన్నారు. సామాజిక శాస్త్రాలలో సమాజమే ప్రయోగశాలగా భావించి పరిశోధనలు చేయాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ్ మామిడాల మాట్లాడుతూ, చాట్ జిపిటి, గూగుల్, డీప్ సీక్ లాంటివి మానవ పరిశోధనలకు సరికావన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ లు ఆచార్య కైసర్ మహమ్మద్, ఆచార్య అపర్ణ డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ వాణి, డాక్టర్ కిరణ్ రాథోడ్ ల తో పాటు వివిధ కళాశాలల మేనేజ్మెంట్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ఉత్తమ పరిశోధన పత్రాల తయారీ పట్ల అవగాహన సంపాదించుకున్నారు.

# పీహెచ్ సీని తనిఖీ చేసిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 04**

: మెండోరా మండలం పోచంపాడ్ లోని సోషల్ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ముందుగా సాంఘిక సంక్షేమ పాఠశాలలో కిచెన్ కం డైనింగ్ హాల్, స్టోర్ రూం డార్మెటరీలను సందర్శించి బియ్యం, కూరగాయలు, పప్పు దినుసులు, వంట నూనె, ఇతర సరుకుల నాణ్యతను పరిశీలించారు. సరుకుల స్టాక్ రిజిష్టర్ తనిఖీ చేశారు. చుట్టూరా ప్రహరీ గోడతో కూడిన సువిశాలమైన పాఠశాల ఆవరణను గమనించిన కలెక్టర్, ప్లే గ్రౌండ్ గురించి ఆరా తీశారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ల్యాబ్ గదుల నిర్మాణాలను పూర్తి చేయించేందుకు తక్షణమే ప్రతిపాదనలు పంపాలని నిర్వాహకులను ఆదేశించారు. కిచెన్ లో నిరుపయోగంగా ఉన్న స్టీమ్ యూనిట్ ను వినియోగంలోకి తేవాలని, 500 పైచిలుకు మంది విద్యార్థినులు కొనసాగుతున్నందున అన్నం, ఇతర ఆహార పదార్థాలు శుచి, శుభ్రతతో చక్కగా వండడానికి ఇది ఉపకరిస్తుందని కలెక్టర్ సూచించారు.

అనంతరం కలెక్టర్ పోచంపాడ్ ఆసుపత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను గమనించారు.



బ్లడ్ శాంపిల్స్ సేకరిస్తూ, మధుమేహం, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వైద్యాధికారులకు సూచించారు.

కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల ఇంచార్జ్ జోనల్ ఆఫీసర్ పూర్ణచందర్, స్కూల్ ప్రిన్సిపాల్ గోదావరి, పీ.హెచ్.సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేశ్ తదతరులు ఉన్నారు.

# కొమురయ్య గెలుపు కాంగ్రెస్ కు చెంప పెట్టు.

## - అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ.





**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 4:**

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొమురయ్య గెలుపు కాంగ్రెస్ కు చెంప పెట్టు లాంటిదని అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్య నారాయణ అన్నారు.తెలంగాణ ప్రాంతీయ ఉపాధ్యాయ సంఘం (తపస్ ) ఆధ్వర్యంలో ప్రగతి నగర్ పాటిదార్ భావన్ లో మంగళవారం నిర్వహించిన ఉపాధ్యాయ వందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతు ఉపాధ్యాయ సమస్యల పట్ల శాసనస మండలిలో ప్రశ్నించే గొంతుకగా మొదటి ప్రాధాన్యతతో కొమురయ్యను గెలిపించిన ఘనత ప్రతి ఒక్క ఉపాధ్యాయునికి దక్కుతుందన్నారు. మేధావులైన ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఒక చెంప పెట్టు లాంటిది అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలు తుంగలో తొక్కి మాటలతో పూట గడుపుతున్న రేవంత్ సర్కార్ కు తగిన గుణపాఠం జరిగిందన్నారు. ఈ ఎమ్మెల్సి ఎన్నికల గెలుపే రేపు తెలంగాణలో బిజెపి ప్రభుత్వం ఏర్పడటానికి పునాది అవుతుందన్నారు. ఈ విజయంలో కష్టపడ్డా తపస్ సంఘ నాయకులకు, బిజెపి కాషాయ కార్యకర్తలకు, ఉపాధ్యాయులకు మేధావులందరికి పాదాభివందనం తెలియజేసారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కష్టపడి పని చేసి బిజెపిని గెలుపు దిశగా నడిపించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, తపస్ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి కృష్ణవేణి, కొండా ఆశన్న, రెంజర్ల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు.



**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 4:**

పట్టణంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు కవాతు చేపట్టారు. కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి అధ్వర్యంలో పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్, డైలీ మార్కెట్, సుభాష్ రోడ్, పాంచ్ చౌరస్తా, బడా మసీద్, నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, రైల్వే గేట్, బతుకమ్మ కుంట, పాత బస్టాండ్ వరకు ఈ ఫ్లాగ్ మార్చ్ కొనసాగింది. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని చెప్పారు. ప్రజలకు తామున్నామనే భరోసా కల్పించడం కోసం ఈ కార్యక్రమం చేపట్టామని

తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి, కామారెడ్డి టౌన్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్ కుమార్, కృష్ణ, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ టీపీ బగేల్, ఇన్స్పెక్టర్లు హరిబాబు, మల్లేశ్వరరావు, ఆర్ఎఫ్ సిబ్బంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సామాజిక, ఆర్థిక సమానత్వం కోసం పోరాడుదాం.

**మహిళలపై హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం.**

**టియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పిట్ల సరిత, పిఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ పిలుపు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 4**

సమాజంలో మహిళలు అన్ని రంగాలలో తమ ప్రతిభను చాటుకుంటున్నప్పటికీ వారికి దక్కవలసిన ఆర్థిక, రాజకీయ సమానత్వం అందడం లేదని, అందుకోసం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమించాల్సిన అవసరం ఉందని టియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పిట్ల సరిత, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ పిలుపునిచ్చారు.

మంగళవారం ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని నగరంలోని ద్వారక నగర్ కార్యాలయం నందు సన్నహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ప్రగతిశీల




మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఆకుల అరుణ మాట్లాడుతూ, ఈ సంవత్సరం సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కై పోరాడుదాం. మహిళలపై హింసను వ్యతిరేకిద్దాం, హైదరాబాదులో జరిగే 72వ ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుందాం అన్న డిమాండ్లతో మార్చి 8 న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరపాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలియజేశారు. తమ శక్తికి మించి ఇంటా బయట పనిచేస్తున్న మహిళలకు ఆర్థిక, రాజకీయ, సమానత్వం అందడం లేదని, ఉత్పత్తిలో సగభాగమైన స్త్రీ ఇంకా వివక్షతకు గురి అవుతుంది అని చెప్పారు. దేశంలో మహిళలకు ఏ రాజకీయ పార్టీ తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదనను వెలిబుచ్చారు. మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని ద్వారక్ నగర్ కార్యాలయం నుండి ర్యాలీ, అనంతరం సభ నిర్వహిస్తామని ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు, తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత మాట్లాడుతూ, స్త్రీని వ్యాపార వస్తువు గా చూపుతున్న 72వ ప్రపంచ అందాల పోటీలు హైదరాబాద్ నగరంలో ఎవరి ప్రయోజనాల కోసం నిర్వహిస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు.

ప్రభుత్వం మహిళా సాధికారత గురించి మాట్లాడుతూనే మరోవైపు అందాల పోటీలు నిర్వహించడం మూలంగా స్త్రీని వ్యాపార వస్తువు గా, అందంగా లేకపోతే మనిషే కాదు అనే విధంగా ప్రచారం నిర్వహిస్తుందని అన్నారు. ఒకవైపు భారత దేశంలో మహిళలంతా అణిచివేతకు గురవుతున్న పరిస్థితులలో అందాల పోటీలను భారతదేశంలో నిర్వహించడం అందులో హైదరాబాద్ నగరంలో నిర్వహించడం సరైనది కాదని దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఒకవైపు కేంద్ర ప్రభుత్వం మహిళల రక్షణ కొరకు, అభివృద్ధి కొరకు కృషి చేస్తున్నామని ప్రకటిస్తూ అందాల పోటీల నిర్వహణకు మద్దతు పలకడం పరోక్షంగా మహిళల్ని అణిచి వేయడమేనని దీనిని వెంటనే ప్రభుత్వాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ అందాల పోటీలను అడ్డుకుంటామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భారతి, నిజాంబాద్ నగర అధ్యక్షురాలు నీలం లక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

# భారత్‌లో టెస్లా పరుగులు ఖాయం

## ముంబైలో తొలి షారూమ్ కోసం ఒప్పందం

ముంబై: ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది. ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు అంటే చదరపు అడుగుకు రూ.900 గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని

యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణెలి వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా

ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన (ఇ÷ఎ) మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# విద్యతోనే “కురుమల” బతుకుల్లో వెలుగు.

**హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ.**

**కురుమ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మాన సభ.**

**వేగుచుక్క న్యూస్, గజ్వేల్, మార్చి 4:**



చదువుతోనే కురుమల జీవితాల్లో వెలుగులు నిండుతాయని హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కురుమ రిజర్వేషన్ పోరాట సమితి కొండపోచమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ చదవాలి ప్రతి ఒక్కరు ఎదగాలని చదివే అందరికీ లక్ష్యంగా మారాలన్నారు. కష్టజీవులుగా ఉన్నా మనము కష్టమైనా చదువును వదలొద్దని అదే మనల్ని సరైన లక్ష్యానికి చేరవేస్తుందన్నారు. అందుకు కొమరవెల్లి మల్లికార్జున స్వామి దర్శించుకున్న ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి శాలువాతో సన్మానం అనంతరం కొండపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తన పూర్వికుల నుండి కొండపోచమ్మ అమ్మవారిని ఇంటిదేవునిగా పిలుస్తున్నామని, గతంలో తెలంగాణ కొరకు ఇక్కడ మొక్కుకున్న మొక్కులను ఆయన గుర్తు చేశారు. కొండపోచమ్మ అమ్మవారి వద్ద టీటీడీ బోర్డు ద్వారా ఫంక్షన్ హాలు గెస్ట్ హౌస్ మంజూరు చేపించాలని స్థానిక నేతల విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించారు.

మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మాట్లాడుతూ, కురుమలకు కేంద్ర ప్రభుత్వం సహాయంతో గొంగడి పరిశ్రమలు మిషన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండ పోచమ్మ అమ్మవారి ఫంక్షన్ హాల్ ఏర్పాటుకు తన ఎంపీ నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధిలో తాను ముందుండి పని చేస్తామన్నారు. ఉన్ని తో తయారు చేసే వస్త్రాలను కేంద్ర బలగాలకు హాస్పటల్ కు రైల్వే లకు ఇచ్చే వస్త్రాలను గొంగళ్ళ పరిశ్రమలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి చూపించేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాదరావు మాట్లాడుతూ, కొండపోచమ్మ అమ్మవారు చాలా మహిమగల అమ్మవారు అని ఇక్కడ కోరిన కోర్కెలు తీర్చే ఇంటి ఇలవేల్పుగా లక్షలాదిమంది భక్తిప్రపత్తులతో దర్శించుకునే తెలంగాణలో అతి ముఖ్యమైన దేవాలయం కొండ పోచమ్మ అని, టీటీడీ ద్వారా ఫంక్షన్ హాల్స్ దేవాలయ అభివృద్ధి కొరకు ఎంపీ నిధులు కేంద్ర నిధులు తో దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 10 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని చెప్పి ఒక్క రూపాయి ఇవ్వకుండా అమ్మవారిని మోసం చేశారన్నారు. కెసిఆర్ మనసుల్ని కాదు దేవుళ్లను మోసం చేసిన వారిలో నిలిచిపోతారు అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ కురుమ సంఘం నాయకులు పెద్దపురం నరసింహ, మాజీ సర్పంచ్ రమేష్ పులి బాలచంద్రం, కుల బీరయ్య సిద్దల రవి , సంఘపు అనిల్, కామల్ల భూమయ్య, రాజు, బింగి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.



# విస్తరణ దిశగా బిజెపి అడుగులు !

మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం తరవాత బిజెపి ఏ మాత్రం తగ్గడంలేదు. ఢిల్లీ గెలుపును ఆకాశమంత చేసి ప్రచారం చేసుకున్నారు. ఢిల్లీ ఎన్నికలకు ముందే జరిగిన వరుస ఎన్నికల ఫలితాలు బిజెపికి అనుకూలంగా రావడంతో ఇక బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికలు జరుగుతాయన్న ప్రచారం జరుగుతున్న వేళ బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. బీహార్‌లోనూ సొంతంగా పాగా వేసేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. బెంగాల్లో మరోమారు తమవంతుగా ప్రయత్నాలు చేపట్టారు. ఈ రెండు రాష్ట్రాల ఎన్నికలు బిజెపికి అత్యంత ముఖ్యం. ఓ రకంగా చెప్పాలంటే బిజెపి ఎత్తుల ముందు కాంగ్రెస్ పెద్దగా ప్రభావం చూపలేక పోతోంది. అంబేద్కర్, రాజ్యాంగం పేరుతో కాంగ్రెస్ ఎంత రచ్చ చేసినా ప్రజలు పెద్దగా పట్టించుకోరు. అలాగే బిజెపి ఎత్తులన్నీ కాంగ్రెస్‌ను పెద్ద దెబ్బకొట్టేలా ఉంటాయి. ఇవేవీ పెద్దగా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. బీజేపీ కూటమి వరుస విజయాలు బిజెపిని తిన్నగా కూర్చోనివ్వడం లేదు. అందుకే దక్షిణాదిలో పాగా వేసేందుకు పావులు కదుపుతోంది. తమిళనాడు, కేరళలో త్వరలో ఎన్నికలు రానున్నాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే బీజేపీతో చేతులు కలిపేందుకు ఆయా రాష్ట్రాల్లో చిన్నాచితక పార్టీలు క్యూ కడుతున్నాయి.ఢిల్లీ విజయం బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలకు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో ముమ్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేకపోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో ఉంది. అందుకే తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. అందుకే టిడిపితో కలిసి అధికారం పంచుకుంది. పవన్ కళ్యాణ్ ఇప్పుడు దక్షిణాదిలో బిజెపికి తురుపు ముక్క కానున్నారు. ఆయన సనాతన ధర్మం పేరుతో చేస్తున్న యాత్రలకు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్రనాయకత్వాలతో ఎప్పటికప్పుడు చర్చిస్తున్నారు.

వేగుచుక్క



# సెబీ కొత్త చీఫ్‌గా తుహిన్ కాంత పాండే నియామకం

స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' నూతన సారథిగా (తుహిన్ కాంత పాండే నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్థిక శాఖ కార్యదర్శిగా పని చేస్తున్న ఆయనకు సెబీ చీఫ్ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర నియామకాల కమిటీ గురువారం ఇందుకు ఆమోదం తెలిపింది. కాగా, ప్రస్తుతం సెబీ చీఫ్‌గా ఉన్న మాధాబీ పురీ బుచ్ మూడేళ్ల పదవీ కాలం నేటితో (ఫిబ్రవరి 28తో) ముగియనుంది. ఈ నేపథ్యంలో తుహిన్ కాంత పాండేను సెబీ కొత్త చీఫ్‌గా ప్రభుత్వం నియమించింది.

తుహిన్ కాంత పాండే 1987 బ్యాచ్ సీనియర్ ఐఏఎస్ అధికారి. ఆయన గతంలో ఆర్థిక కార్యదర్శిగా, రెవెన్యూ కార్యదర్శిగా పనిచేశారు. ఎయిరిండియా ప్రైవేటీకరణలో పాండే కీలక పాత్ర పోషించారు. తుహిన్ కాంత పాండేకు ఫైనాన్స్, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లో విస్తృత అనుభవం ఉంది. రానున్న మూడేళ్ల పాటు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు.

ఇక ఇప్పటి వరకూ సెబీకి చీఫ్‌గా వ్యవహరించిన మాధాబీ పూరీ బుచ్‌ను కేంద్రం 2022 ఫిబ్రవరి 28న నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆమె అదే ఏడాది మార్చి 2వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. సెబీకి ఓ మహిళ చైర్మన్‌గా నియామకం కావడం ఇదే తొలిసారి. మాధవి గతంలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ హెడ్‌గా సేవలందించారు. 2017 నుంచి 2021 మధ్య కాలంలో సెబీ పూర్తి స్థాయి మెంబర్‌గా పని చేశారు. సెబీ చీఫ్‌గా ఆమె పదవీ కాలం నేటితో ముగియనుంది.

# దలాల్ స్ట్రీట్‌పై ట్రంప్ సుంకాల హెచ్చరికల దెబ్బ..



చైనా ఉత్పత్తులపై పది శాతం అదనపు దిగుమతి సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్లలో ధోరణికి అనుగుణంగా దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం సుమారు రెండు శాతం పతనంతో ముగిశాయి. దేశీయ స్టాక్ మార్కెట్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'టారిఫ్'ల మోత మోగుతున్నది. ఇప్పటికే చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై అదనంగా పది శాతం సుంకాలు విధిస్తామని డొనాల్డ్ ట్రంప్ తాజాగా చేసిన ప్రకటన ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలహీన పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో నష్టాలకు అనుగుణంగా ఫలితంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు నెత్తురోడాయి. బీఎస్ఈ-30 సెన్సెక్స్, ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ దాదాపు రెండు శాతం వరకూ నష్టపోయాయి.

బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ 1,414.33 పాయింట్లు (1.90 శాతం) నష్టపోయి 73,198.10 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 1,471.16 పాయింట్లు (1.97 శాతం) పతనంతో 73,141.27 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా ఎనిమిదో రోజు నష్టాలను చవి చూసింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ ట్రేడింగ్ ముగిసే సమయానికి 420.35 పాయింట్లు (1.86 శాతం) నష్టపోయి 22,124.70 పాయింట్ల వద్ద స్థిర పడింది. గతేడాది సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్ట స్థాయి 85,978.25 పాయింట్లను తాకిన సెన్సెక్స్.. నాటి నుంచి ఇప్పటి వరకూ 12,780.15 పాయింట్లు (14.86శాతం) నష్టపోయింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ గత సెప్టెంబర్ 27న జీవిత కాల గరిష్టం 26,277.35 పాయింట్లకు చేరుకుంది. నాటి నుంచి ఇప్పటి వరకూ 4,152.65 పాయింట్లు (15.80 శాతం) నష్టపోయింది. బీఎస్ఈ సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా ఆరు శాతానికి పైగా నష్టపోగా, ఇండస్‌ఇండ్ బ్యాంకు ఐదు శాతం పతనమైంది. మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, ఇన్ఫోసిస్, టాటా మోటార్స్, టైటాన్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), నెస్లే, మారుతి సుజుకి స్టాక్స్ భారీగా పతనం అయ్యాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మాత్రమే లాభాలతో ముగిసింది. ఆసియా మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ భారీ నష్టాలతో సరిపెట్టుకున్నాయి. యూరోపియన్ యూనియన్ మార్కెట్లు పూర్తిగా నష్టాలతో ముగిశాయి. గురువారం వరకూ విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ.556.56 కోట్ల విలువైన వాటాలు ఉపసంహరించారు. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌పై 0.69 శాతం తగ్గి 73.53 డాలర్లు పలుకుతుంది.

# దేశీయ విమాన ప్రయాణికులు హైజంప్..

**సరైన సమయానికి విమాన సర్వీసులు నడిపిన సంస్థల్లో 75.5 శాతంతో ఇండిగో తొలిస్థానంలో నిలువగా..ఆకాశ ఎయిర్ 71.5 శాతం, ఎయిర్ ఇండియా 69.8 శాతం, అలయెన్స్ ఎయిర్ 57.6 శాతం, స్పైస్‌జెట్ 54.8 శాతంతో ఉన్నాయి. గత నెలలో విమానాలు రద్దు కావడంతో 41 వేల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.**



దేశీయ విమానప్రయాణికులు అంతకంతకు పెరుగుతున్నారు. జనవరి నెలలో దేశీయంగా 1.46 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని డీజీసీఏ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన 1.31 కోట్లతో పోలిస్తే 11.28 శాతం అధికమయ్యారని తెలిపింది. సంస్థల వారీగా 65.2 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో తొలిస్థానంలో నిలిచింది.

దేశీయ విమానప్రయాణికులు అంతకంతకు పెరుగుతున్నారు. జనవరి నెలలో దేశీయంగా 1.46 కోట్ల మంది విమానాల్లో ప్రయాణించారని డీజీసీఏ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో ప్రయాణించిన 1.31 కోట్లతో పోలిస్తే 11.28 శాతం అధికమయ్యారని తెలిపింది. సంస్థల వారీగా 65.2 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో తొలిస్థానంలో నిలిచింది. ఎయిర్ ఇండియా (గ్రూపు మార్కెట్ వాటా 25.7 శాతానికి తగ్గింది. అలాగగే ఆకాశా ఎయిర్, స్పైస్‌జెట్‌ల మార్కెట్ వాటా వరుసగా 4.7 శాతం, 3.2 శాతానికి పెరిగాయి.

గత నెలలో విమానాల రద్దు 1.62 శాతంగా ఉన్నాయి. వీటిలో అత్యధికంగా ఫ్లై బిగ్ వాటా 17.74 శాతంగా ఉండగా, ఆ తర్వాతి స్థానాల్లో ఫ్లై 91(5.09 శాతం) అలయెన్స్ ఎయిర్(4.35 శాతం) ఉన్నాయని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. సరైన సమయానికి విమాన సర్వీసులు నడిపిన సంస్థల్లో 75.5 శాతంతో ఇండిగో తొలిస్థానంలో నిలువగా..ఆకాశ ఎయిర్ 71.5 శాతం, ఎయిర్ ఇండియా 69.8 శాతం, అలయెన్స్ ఎయిర్ 57.6 శాతం, స్పైస్‌జెట్ 54.8 శాతంతో ఉన్నాయి. గత నెలలో విమానాలు రద్దు కావడంతో 41 వేల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీరికి విమానయాన సంస్థలు రూ.46.46 లక్షలు పరిహారం రూపంలో చెల్లించాయి.

ఆకాశ ఎయిర్ మరో ప్రాంతీయ రూట్‌లో నూతన విమాన సర్వీసును ప్రారంభించడానికి సిద్ధమవుతున్నది. ఏప్రిల్ 4 నుంచి హైదరాబాద్ నుంచి బీహార్‌లోని దర్భంగా(వయా ఢిల్లీ) మధ్య సర్వీసును అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు ప్రకటించింది. ఈ రెండు నగరాల మధ్య రోజువారి విమాన సర్వీసును నడుపుతున్నట్లు తెలిపింది.

# భారత్‌పై టారిఫ్‌ల కత్తి!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ హెచ్చరికలకు కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు తలొగ్గినట్టే కనిపిస్తున్నది. తమ దేశ వస్తూత్పత్తులపై అధిక సుంకాలను వేస్తున్న దేశాలకు ప్రతీకార సుంకాలు తప్పవని అగ్రరాజ్య అధ్యక్షుడు ఈమధ్య కాలంలో పదేపదే చెప్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్‌కూ సుంకాల పోటు ఉంటుందని ఇటీవలి అమెరికా పర్యటనలో ప్రధాని మోదీకి ట్రంప్ నిర్మొహమాటంగా చెప్పిన సంగతీ విదితమే. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైనట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న వివిధ రకాల దిగుమతులపై ప్రస్తుతం విధిస్తున్న సుంకాలను తగ్గించేందుకున్న అవకాశాలను అన్వేషిస్తున్నట్టు సంబంధిత అధికార వర్గాలు చెప్తున్నాయి.

కార్లు, మోటర్‌సైకిళ్లు తదితర ఆటోమొబైల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, రసాయనాలు, కీలక ఔషధాలు, కొన్ని వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, విస్కీసహా మరికొన్నింటిపై వసూలు చేస్తున్న సుంకాలను తగ్గించే వీలుందంటున్నారు. తద్వారా అమెరికా అధిక సుంకాల నుంచి తప్పించుకోవచ్చన్న అభిప్రాయాలను వారు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కేంద్ర ప్రభుత్వం.. అమెరికా సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పటికే నిర్దేశించుకున్న సుంకాల కోత కంటే ఇంకా ఎక్కువగానే టారిఫ్‌లను తగ్గించాల్సి రావచ్చన్న అంచనాలను వారు వెలిబుచ్చుతుండటం గమనార్హం. దీంతో చాలారకాల వస్తు, సేవల దిగుమతులపై పెద్ద ఎత్తునే సుంకాలు తగ్గవచ్చని చెప్తున్నారు.ప్రస్తుతం అమెరికా సుంకాల హెచ్చరికలు.. యావత్తు ప్రపంచ వాణిజ్యాన్నే వణికిస్తున్నాయి. ఇప్పటికే స్టాక్, కరెన్సీ, కమోడిటీ మార్కెట్లపై ఆ ప్రభావం కనిపిస్తున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఆయా దేశాలతో పాటు భారత్ సైతం అమెరికాతో స్నేహపూర్వక వాతావరణానికి ప్రయత్నిస్తున్నది. ముఖ్యంగా చైనాతో వాణిజ్య యుద్ధానికి ట్రంప్ కాలుదువ్వుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను భారత్ అందిపుచ్చుకునేందుకు చొరవ చూపాలని మెజారిటీ ఆర్థిక నిపుణులు సలహా ఇస్తున్నారు. నిజానికి గ్లోబల్ మార్కెట్‌లో చైనాకు చెక్ పెట్టాలంటే భారత్‌ను ప్రోత్సహించడమే మార్గమని అమెరికా సైతం భావిస్తున్నది. దీంతో అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తున్నది. మరోవైపు భారత్‌కు రక్షణపరమైన ఎగుమతుల్ని పెంచాలని అమెరికా చూస్తున్నది. అయితే ఇప్పుడు రష్యా నుంచే ఎక్కువగా ఇక్కడికి వస్తున్నాయి. ఫలితంగా రష్యాతో సంబంధాలు చెడకుండా ట్రంప్ మెప్పును పొందే పనిలో మోదీ సర్కారున్నట్టు చెప్తున్నారు. ఇక 2030 నాటికి ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరాలని అటు అమెరికా, ఇటు భారత్ లక్ష్యంగా పెట్టుకున్నాయి. 2023లో ఇది 127 బిలియన్ డాలర్లే. పొరుగు దేశాలైన మెక్సికో, కెనడాలపై టారిఫ్‌లను మంగళవారం నుంచి విధించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం. అలాగే చైనా నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం యూనివర్సల్ టారిఫ్‌ను రెట్టింపు చేయాలని కూడా చూస్తున్నట్టు తెలుస్తున్నది. కాగా, అమెరికాలోకి ఎంతమాత్రం ఉపేక్షించని విధంగా మనుషుల అక్రమ రవాణా, ఔషధాల స్మగ్లింగ్ జరుగుతున్నదని, వీటికి అడ్డుకట్ట వేసేందుకు అధిక సుంకాలు ఒక్కటే మార్గమని ట్రంప్ అనుకుంటున్నారు.

## సొంతింట్లోంచి కోటి రూపాయలు
# కొట్టేసిన పదో తరగతి బాలుడు..

తల్లిదండ్రులు సంపాదించిన డబ్బులతో జల్సాలు చేస్తున్నాడు. చదివేది పదో తరగతే అయినా చెడు తిరుగుళ్లతో విపరీతంగా డబ్బులు ఖర్చు చేశాడు. అది గుర్తించిన తండ్రి పద్ధతి మార్చుకోమన్నాడు. ఇలాగే పిచ్చి వేషాలు వేస్తే ఆస్తిలో చిల్లి గవ్వ కూడా ఇవ్వనంటూ బెదిరించాడు. దీంతో తండ్రిపై పగ పెంచుకున్న బాలుడు స్నేహితుల సాయంతో సొంతింట్లోనే దొంగతనానికి పాల్పడ్డాడు. మొత్తంగా 80 లక్షల రూపాయల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు సహా 20 లక్షల రూపాయల నగదును దోచేశాడు. చివరకు పోలీసులకు చిక్కి ఊచలు లెక్కబెడుతున్నాడు.

ఉన్నంతలో కొడుకును బాగా చూసుకోవాలనుకున్నాడు. అందుకే ఏ పనీ చెప్పకుండా అడిగినంత డబ్బు ఇచ్చాడు. అదే అతడు చేసిన తప్పు అయింది. తండ్రి ఇచ్చిన డబ్బులతో స్నేహితులతో కలిసి చెడు తిరుగుళ్లు ప్రారంభించాడు. విషయం గుర్తించిన తండ్రి వారితో స్నేహం మానేసి బుద్ధిగా ఉండమన్నాడు. కానీ బాలుడు మాత్రం ఇలాగే ఉంటానని తెగేసి చెప్పాడు. దీంతో ఆ తండ్రి నీకు ఇకనుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వను, పెద్దయ్యాక కూడా ఆస్తి పంచివ్వనని బెదిరించాడు. దీంతో నాన్నపై పగ పెంచుకున్న ఆ బాలుడు స్నేహితులతో కలిసి ఇంట్లోంచి కోటి రూపాయలు కొట్టేశాడు. చివరకు పోలీసులకు చిక్కి ఊచలు లెక్కబెడుతున్నాడు. ఆ పూర్తి వివరాలు మీకోసం.

ఉత్తర ప్రదేశ్ కాన్పూర్‌లోని పాంకి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి.. బట్టలకు రంగులు వేసే వ్యాపారం చేస్తున్నాడు. అయితే ఇతడికి పదో తరగతి చదువుతున్న కుమారుడు కూడా ఉన్నాడు. ముందు నుంచి కుమారుడిపై ప్రేమ, కష్టం తెలియకుండా పెంచాలనే ఉద్దేశంతో గారాభంగా పెంచాడు. అడిగినన్ని డబ్బులు ఇవ్వడంతో.. బాలుడు చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. ఐదారుగురు స్నేహితులను వెంట పెట్టుకుని.. ఎప్పుడూ చిల్లరగా తిరిగేవాడు. విషయం గుర్తించిన తండ్రి కొడుకును మార్చుకోవాలనుకున్నాడు. ఈక్రమంలోనే ఓరోజు కూర్చోబెట్టి మాట్లాడాడు. పద్ధతి మార్చుకోమని వివరించాడు.

కానీ బాలుడు మాత్రం తనకు నచ్చినట్లే ఉంటానని చెప్పగా.. తండ్రి తీవ్ర కోపోద్రేకానికి గురయ్యాడు. ఇలాగే చేస్తే ఆస్తిలో చిల్లి గవ్వ కూడా ఇవ్వనని బెదిరించాడు. అంతేకాకుండా వీలునామా రద్దు చేసి ఇంటి నుంచి కూడా బయటకు పంపించేస్తానన్నాడు. దీంతో తండ్రిపై కోపం పెంచుకున్న బాలుడు... పగ తీర్చుకోవాలనుకున్నాడు. ఇదే విషయాన్ని స్నేహితులకు చెప్పి.. ఇంట్లోంచి డబ్బులు కొట్టేయాలని ప్లాన్ వేశాడు. పథకం ప్రకారం ఫిబ్రవరి 27వ తేదీన తన ఆరుగురు స్నేహితులను వెంట బెట్టుకుని ఇంటికి వెళ్లాడు. మొత్తంగా కోటి రూపాయల కొట్టేశాడు. ఇందులో 20 లక్షల రూపాయలు నగదు ఉండగా.. రూ.80 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు ఉన్నాయి.

ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు చోరీ కావడంతో.. సదరు వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా వ్యాపారి కూమారుడే ఈ చోరీకి పాల్పడ్డట్లు తెలిసింది. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ఈ నిజం బయట పడగా.. పోలీసులు బాలుడిని అరెస్ట్ చేశారు. ఆపై జువైనల్ హోమ్‌కు తరలించారు.

అలాగే అతడికి సహకరించిన మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 4 లక్షల రూపాయల నగదు, 165 గ్రాముల బంగారం, 3 కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులను పట్టుకుంటామని.. గాలింపు చర్యలు చేపడుతున్నామని పోలీసులు వివరించారు. మిగిలిన సొత్తు ఆ ఇద్దరి దగ్గరే ఉండే అవకాశం ఉందని.. ఇప్పటికే ఇందులో ఇద్దరిపై గతంలోనే కొన్ని చోరీ కేసులు నమోదు అయినట్లు చెప్పుకొచ్చారు.

**బాలుడు చెడు సావాసాలకు అలవాటు పడ్డాడు. స్నేహితులను వెంట పెట్టుకుని.. ఎప్పుడూ చిల్లరగా తిరిగేవాడు. విషయం గుర్తించిన తండ్రి కొడుకును మార్చుకోవాలనుకున్నాడు. ఈక్రమంలోనే ఓరోజు పద్ధతి మార్చుకోమని వివరించాడు. కానీ బాలుడు మాత్రం తనకు నచ్చినట్లే ఉంటానని చెప్పగా.. తండ్రి తీవ్ర కోపోద్రేకానికి గురయ్యాడు. ఇలాగే చేస్తే ఆస్తిలో చిల్లి గవ్వ కూడా ఇవ్వనని బెదిరించాడు. అంతేకాకుండా వీలునామా రద్దు చేసి ఇంటి నుంచి కూడా బయటకు పంపించేస్తానన్నాడు. దీంతో తండ్రిపై కోపం పెంచుకున్న బాలుడు... పగ తీర్చుకోవాలనుకున్నాడు. ఇదే విషయాన్ని స్నేహితులకు చెప్పి.. ఇంట్లోంచి డబ్బులు కొట్టేయాలని ప్లాన్ వేశాడు. ఫిబ్రవరి 27వ తేదీన తన ఆరుగురు స్నేహితులను వెంట బెట్టుకుని ఇంటికి వెళ్లాడు. మొత్తంగా కోటి రూపాయల కొట్టేశాడు.**

# జనంపై దాడికి యత్నించిన ఏఐ రోబో..



రోబో సినిమాలో హీరో తయారు చేసిన రోబో ఎన్నో మంచి పనులకు ఉపయోగపడుతుంది. అయితే అదే రోబో చివరికి ఎంతో మంది ప్రాణాలు తీస్తుంది. అచ్చం అలాంటి సంఘటనే తాజాగా ఒకటి చోటు చేసుకుంది. భారీగా జనం గుమిగూడి ఉన్న ప్రాంతంలో ఉన్న ఓ ఏఐ రోబో.. అక్కడ ఉన్నవారిపై దాడి చేసేందుకు ప్రయత్నించింది. అయితే అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది ఆ రోబోను అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో మరోసారి రోబోలు అంటే జనం భయపడిపోతున్నారు. ఇంతకీ ఈ ఘటన ఎక్కడ, ఎలా జరిగింది అనేది ఈ స్టోరీలో చూద్దాం.

టెక్నాలజీ ఎంత డెవలప్ అయితే అంత ఉపయోగాలు ఉంటాయి. అయితే అదే స్థాయిలో ప్రతికూలతలు కూడా ఉంటాయి అనేది కొన్ని వర్గాలు చెప్పే మాట. ఇక ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోలను డెవలప్ చేయడానికి అనేక పరిశోధనలు, ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే మనిషి ఇలా టెక్నాలజీపై, యంత్రాలపై అధికంగా ఆధారపడి.. మానవజాతి అంతానికి నాంది పలుకుతున్నాడనే వాదనలు వినిపిస్తూనే ఉన్నాయి. అచ్చం వాటన్నింటి ఆధారంగానే రజినీకాంత్ హీరోగా గతంలో రోబో అనే సినిమా వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ సినిమాలో మంచి కోసం రజినీకాంత్.. అచ్చం తన రూపంలో ఉండే ఒక హ్యూమనాయిడ్ రోబోను తయారు చేస్తారు. ఆ రోబో మంచి పనులు చేస్తుంది. కానీ విలన్ అందులోని సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేయడంతో.. మనిషి లాగా ఉన్న ఆ రోబో.. ఒక్కసారిగా నరరూప రాక్షసుడిగా మారిపోయి.. మనుషుల ప్రాణాలు తీస్తుంది.

ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఓ సంఘటన మళ్లీ అలాంటి ఘటనను గుర్తు చేసింది. చైనాలో ఏర్పాటు చేసిన ఓ రోబో ఎగ్జిబిషన్‌లో ఆర్టిఫిషియల్ రోబో.. అక్కడికి వచ్చిన సందర్శకులను తీవ్ర భయకంపితులను చేసింది. ఆ ఎగ్జిబిషన్‌కు వచ్చిన వారిపైకి ఒక్కసారిగా దూసుకెళ్లి దాడి చేయబోయింది. దీంతో అక్కడ ఉన్న వారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అది గమనించిన అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది.. ఆ రోబోను అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వీడియో క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో.. రోబోలు, టెక్నాలజీ విషయంలో ఉన్న భయాందోళనలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

ఇక ఆ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. మానవ జాతి అంతానికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజన్స్ ఒక మొదటి అడుగులాగా అనిపిస్తోందని పేర్కొంటున్నారు. ఇవి రోబోలు కావని.. మనుషుల ప్రాణాలు తీసే జాలి, దయ లేని క్రూరమైన యంత్రాలు అంటూ నెటిజన్లు విరుచుకుపడుతున్నారు. ఇక ఇలాంటివి చూస్తుంటే.. భవిష్యత్తుపై తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోందని పేర్కొంటున్నారు.

ఈశాన్య చైనాలో ఫిబ్రవరి 9వ తేదీన రోబో ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో యూనిట్రీ రోబోటిక్స్ కంపెనీకి చెందిన ఒక హ్యూమనాయిడ్ రోబోను కూడా తీసుకువచ్చారు. అయితే ఈ హ్యూమనాయిడ్ రోబో మనుషుల కదలికల గుర్తించి.. వాటికి అనుగుణంగా స్పందిస్తుంది. అంతేకాకుండా కొన్ని మాటలు కూడా మాట్లాడుతుంది. ఈ క్రమంలోనే ఆ హ్యూమనాయిడ్ ఏఐ రోబో.. ఒక్కసారిగా సందర్శకులపైకి దూసుకురావడం తీవ్ర కలకలం రేపుతోంది.

ఈ ఘటనపై రోబో ఎగ్జిబిషన్ నిర్వాహకులు స్పందించారు. రోబోలో ఏర్పడిన సాంకేతిక లోపం కారణంగానే ఈ ఘటన సంభవించిందని చెప్పారు. అయితే పూర్తిగా అన్ని పరీక్షలు చేయకుండానే.. హ్యూమనాయిడ్ రోబోను ఎగ్జిబిషన్‌కు ఎందుకు తీసుకువచ్చారంటూ సందర్శకులు ప్రశ్నించారు. ఎగ్జిబిషన్‌కు తీసుకువచ్చిన రోబోలకు సరైన భద్రతా పరీక్షలు చేయలేదంటూ ఆరోపించారు. సాఫ్ట్‌వేర్ బగ్ కారణం ఒకటే కాదని.. అందులో ఇంకా చాలా తప్పిదాలు ఉన్నాయని కొందరు టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# డ్యాన్స్ ఇరగదీసిన మోనాలిసా..



వైరల్ గర్ల్ మోనాలిసా పట్టిందల్లా బంగారమే అవుతోంది. ఇప్పటికే బాలీవుడ్ సినిమాలో ఆఫర్ దక్కించుకున్న ఈ తేనెకళ్ల సుందరి.. ఆ తర్వాత షోరూమ్ ఓపెనింగ్‌కు వెళ్లి అందరి దృష్టిని ఆకర్షించింది. అటు సినిమా అవకాశాల్లో ఉండగానే.. ఇటు ప్రమోషన్స్‌పైనా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆమె ఏకంగా విదేశాలకు వెళ్లింది. స్టేజ్‌పైనే ఐ లవ్ యూ చెప్పేసిన మోనాలిసా.. డ్యాన్స్‌తో ఇరగదీసింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

ప్రయాగ్‌రాజ్ మహా కుంభమేళాలో పూసలు, రుద్రాక్ష దండలు అమ్ముకుంటూ సోషల్ మీడియాలో ఒక్కసారిగా సెన్సేషన్‌గా మారిన వైరల్ గర్ల్ మోనాలిసా భోంస్లే.. అప్పటినుంచి వరుసగా వార్తల్లో నిలుస్తోంది. ఇక బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రా తీస్తున్న ది స్టోరీ ఆఫ్ మణిపూర్ చిత్రంలో కీలక పాత్రను దక్కించుకున్నప్పటి నుంచి మోనాలిసా పేరు దేశవ్యాప్తంగా మారుమోగిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆమె కోజికోడ్ జిల్లాలో ఓ జ్యువెలరీ షాప్ ఓపెనింగ్‌కు వెళ్లిన మోనాలిసాను చూసేందుకు అక్కడికి భారీగా జనం తరలిరావడంతో ఆమె క్రేజ్ ఎంత ఉందో అర్థం అయిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా ఇటీవల మహా శివరాత్రి సందర్భంగా ఆమె నేపాల్ పర్యటనకు వెళ్లారు. మహా శివరాత్రి పండగ వేళ.. బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రాతో కలిసి.. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోనాలిసా పాల్గొంది. ఇక ఆ కార్యక్రమానికి స్థానికంగా భారీగా జనం తరలివచ్చారు. నేపాల్‌లోని మైలాపూర్‌లో నిర్వహించిన మహా శివరాత్రి ఉత్సవాల్లో ఆమె ప్రదర్శన ఇచ్చింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికపై మొదట ప్రసంగించిన మోనాలిసా.. ఈ క్రమంలోనే అంతా ఎలా ఉన్నారంటూ అడిగింది.

ఆ తర్వాత ఐ లవ్ యూ అంటూ అక్కడికి వచ్చిన కుర్రకారును ఉత్సాహ పరిచింది. ఇక ఆ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను మోనాలిసా తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లో షేర్ చేయడంతో ఆ వీడియో ఇప్పుడు నెటిజన్లను తెగ ఆకర్షిస్తోంది. ఇక ఆ వీడియోకు నెటిజన్ల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది. చాలా మంది నెటిజన్లు.. ఆమె తొందర్లోనే గొప్ప స్థాయికి వెళ్లిందని కొనియాడుతున్నారు. ఆమె డ్యాన్స్ బాగా చేసిందని.. ఇంకా ఉన్నత స్థితికి వెళ్లాలని ఆకాంక్షించారు. పేద కుటుంబం నుంచి వచ్చిన మోనాలిసాను అందరూ ప్రోత్సహించాలని పేర్కొంటూ కామెంట్లు పెడుతున్నారు.

**నుంచి మోనాలిసా పేరు దేశ వ్యాప్తంగా మారుమోగిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆమె కోజికోడ్ జిల్లాలో ఓ జ్యువెలరీ షాప్ ఓపెనింగ్‌కు వెళ్లిన మోనాలిసాను చూసేందుకు అక్కడికి భారీగా జనం తరలిరావడంతో ఆమె క్రేజ్ ఎంత ఉందో అర్థం అయిపోయింది. ఈ క్రమంలోనే తాజాగా ఇటీవల మహా శివరాత్రి సందర్భంగా ఆమె నేపాల్ పర్యటనకు వెళ్లారు. మహా శివరాత్రి పండగ వేళ.. బాలీవుడ్ డైరెక్టర్ సనోజ్ మిశ్రాతో కలిసి.. అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోనాలిసా పాల్గొంది. ఇక ఆ కార్యక్రమానికి స్థానికంగా భారీగా జనం తరలివచ్చారు.**